క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ట్రైనీ కలెక్టర్ శుభం నోఖ్వాల్



జి.కొండూరు: పదో తరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించాలని స్వతంత్ర హోదాలో జి.కొండూరు ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ కలెక్టర్ శుభం నోఖ్వాల్ అన్నారు. జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, రెగ్యులర్ ఎంపీడీఓ రామకృష్ణనాయక్‌తో కవులూరు జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చర్చించిన ట్రైనీ కలెక్టర్ వారికి అందుతున్న వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యతోనే వ్యక్తికి సమాజంలో గౌరవం



మైలవరం: విద్యతోనే వ్యక్తికి సమాజంలో గౌరవం లభిస్తుందని ఎంఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎం. నాగేశ్వరరెడ్డి తెలిపారు. మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెంలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్య బలమైన ఆయుధమని, కలలను సాకారం చేసుకోవాలంటే చదువును సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని, కష్టపడాల్సిన అవసరం లేదన్నారు. పట్టుదలతో చదివితే భవిష్యత్తు విద్యార్థులకు తలవంచుతుందని తెలిపారు.

గంపలగూడెం ఎంపీడీఓగా నాగేశ్వరరావు



గంపలగూడెం: మండల అభివృద్ధి అధికారిగా పి. నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన నాగేశ్వరరావును గంపలగూడెం ఎంపీడీఓగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన ఈఓపీఆర్డీ బాబూరావు ఇక మీదట ఈఓపీఆర్డీగా కొనసాగుతారు.

పూర్వపు లయన్స్ అధ్యక్షులకు సత్కారం

తిరువూరు: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్‌తో భాగంగా పూర్వపు లయన్స్ క్లబ్ అధ్యక్షులను తిరువూరులో సోమవారం సన్మానించారు. స్థానిక లయన్స్ భవనంలో గత 32 ఏళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించిన వారిని ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు పసుమర్తి వెంకటేశ్వరరావు, నాగుబండి శ్యాం సుందర్ తదితరులు సత్కరించారు. క్లబ్ సభ్యులు చింతల వెంకటరెడ్డి, కంచర్ల ముత్యప్రసాద్, రాజేష్‌ఖన్నా, గంజా కృష్ణమోహన్, సంకా రాంబాబు, సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఆగిరిపల్లి: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని మైక్రాన్ టెక్నాలజీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మాకినేని శివ అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలలో రెండు రోజుల నుంచి హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి అండర్–16 కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలుర కబడ్డీ పోటీల్లో మధురై జట్టు ప్రథమ స్థానం, చెన్నై జట్టు ద్వితీయ స్థానం సాధించారు. బాలికల కబడ్డీ పోటీల్లో చెన్నై జట్టు ప్రథమ స్థానం, బెంగళూరు జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. వీరికి హెచ్‌సీఎల్ ఫౌండేషన్ అసోసియేట్ మేనేజర్ నందగోపాల్ బహుమతులు అందజేశారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ఆసియన్ గేమ్స్ బంగారు పతాక గ్రహీత కల్యాణి పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహా సభలను జయప్రదం చేయండి

మైలవరం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఏర్పడి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా కాకినాడలో జనవరి 5నుంచి 8వ తేదీ వరకు జరిగే స్వర్ణోత్సవ మహా సభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు తెలిపారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బైక్ జాతా సోమవారం మైలవరం చేరుకుంది. మైలవరం నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జండాను మైలవరం మండల శాఖ వ్యవస్థాపక అధ్యక్షులు పాల్ బాబూరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అలవాల సుందరయ్య, జిల్లా కార్యదర్శి కె. గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొణిజెర్లలో పేకాట శిబిరంపై దాడి

కొణిజెర్ల(గంపలగూడెం): మండలంలోని కొణిజెర్లలో పేకాటాడుతుండగా అందిన సమాచారం మేరకు తిరువూరు సీఐ కె. గిరిబాబు సిబ్బందితో కలిసి సోమవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ పేకాడుతున్న 11మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.38,780 స్వాధీనం చేసుకున్నారు.

ఆశలు రాలిపోతున్నాయ్!

- పూత మాడి రాలిపోతున్న మామిడి
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు



కొత్త మంగాపురంలో మామిడి తోట (ఇన్‌సెట్) మామిడిలో మాడిపోయిన పూత

మైలవరం: ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు అధిక వర్షాలు, వరదల ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో మామిడి తోటలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మామిడి పూత మాడి, రాలిపోతుండటంతో ఏం చేయాలో తోచక రైతులు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి..

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం మండలంలో 6,800 ఎకరాలు, రెడ్డిగూడెం మండలంలో 10వేల ఎకరాలు, జి.కొండూరు మండలంలో 6వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. సహజంగా నవంబర్, డిసెంబర్ మాసాల్లో మామిడిలో పూత వస్తుంది. సరైన సమయంలో పూత రాకుంటే మామిడి దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. సహజంగా మామిడికి పగలు వేడి వాతావరణం, రాత్రి వేళల్లో చలి వాతావరణం ఉండాలి. ఈ విధంగా ఉంటే డిసెంబర్ నాటికి సుమారు 80శాతం తోటల్లో పూత కనిపిస్తుంది. ఈ సంవత్సరం అనుకూలంగా లేకపోవడంతో 40 శాతం మాత్రమే పూత కనిపిస్తోంది. ఈ పూత కూడా బంగినపల్లి రకం కంటే కలెక్టర్, రసాలు రకాలలో ఎక్కువగా ఉంటుంది. ఇటీవల తరచుగా అల్ప పీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వచ్చిన పూతలో కూడా కొంత మేర మాడిపోయి రాలిపోతుంది. కొత్తగా పూత కనిపించకపోవడం, ఉన్న పూత రాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మామిడికి పెట్టుబడులు కూడా పెరిగాయి. ఎకరానికి కనీసంగా ఇప్పటి వరకు రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతు జొన్నల శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులు కూడా పట్టించుకోకపోవడం రైతులను మరింతగా బాధిస్తోంది. సీజన్‌లో ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సూచనలివ్వాల్సి ఉంది.

రైతులకు ఈ ఏడాది అన్నీ కష్టాలే..

రైతులకు ఈ ఏడాది అన్ని కష్టాలే మిగిలాయి. పంట చేతికి వచ్చే సమయానికి తుపాను రావడంతో పంట దెబ్బ తిని తీవ్రంగా నష్టపోయాం. పెసర, మినుము, వరి తదితర పంటలు చేతికొచ్చిన సమయానికి తుపాను ప్రభావంతో వర్షాలు కురవడంతో దెబ్బతిన్నాం. మామిడిలో కూడా పూత రాలిపోతోంది. మామిడి తోటలకు ఇప్పటి వరకు సుమారు రూ.25వేలు పెట్టుబడి పెట్టాం. రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.

– వజ్రాల వెంకటరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి, పుల్లూరు

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సాధ్యమైనంత త్వరితగతిన పరిష్కరించాలని, అలసత్వం వహించొద్దని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో 22 అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అర్జీల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జీ విద్యాసాగర్, హెచ్‌ఓ ఆర్ హేమ, డీఏల్‌డీఓ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌పీఓ సందరి, ఏపీసీపీడీసీఎల్ రూరల్ ఏడీ పోతురాజు, పీఆర్ ఈఈ బాపిరెడ్డి, సర్వే డీఐ రంగారావు పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- భర్త ఏసేబు, కుమారుడు రవికుమార్ తనపై దాడి చేసి ఇంటిని కాజేశారని, ఆ ఇంటిని తనకు ఇప్పించాలని కోరుతూ నూజివీడు మండలం పల్లెర్లమూడికి చెందిన శిలారపు నీలమ్మ సబ్‌కలెక్టర్‌కు అర్జీని అందజేసింది.
- ముసునూరు మండలం చిల్లబోయినపల్లిలో ఆర్ఎస్ నంబరు–4లో 39ఎకరాల సీలింగ్ భూమిని 1992లో 120 మంది రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వగా.. దానిని సాగు చేసుకుంటున్నారు. అయితే అక్రమార్కులు దౌర్జన్యంగా ఆక్రమించి పేదలను ఇబ్బంది పెడుతున్నారని, ఆక్రమణదారుల చెర నుంచి విడిపించాలని కోరుతూ గ్రామస్తులు పలువురు అర్జీని అందజేశారు.

అవినీతి ఆరోపణలపై సబ్‌కలెక్టర్ విచారణ



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

చాట్రాయి: రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది అవినీతి ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదులపై సోమవారం నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ డి.ప్రశాంతి అవినీతికి పాల్పడుతున్నారంటూ పర్వతాపురం గ్రామానికి చెందిన కల్లెపల్లి ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు తహసీల్దార్ లేకుండా కార్యాలయంలో ఫిర్యాదుదారులతో విచారణ చేశారు. వీఆర్వోలు లంచం అడుగుతున్నారంటూ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదుదారులు వివరించారు. ఫిర్యాదులను లిఖితపూర్వకంగా తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు.

మహిళా విద్యతో సర్వతోముఖాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: ఆడపిల్లలను ఉన్నత విద్య చదివించాలని, మైనారిటీ తీరకుండా పెళ్లి చేయవద్దని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక షాదీఖానాలో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మగపిల్లలతో పాటు ఆడపిల్లలనూ ఉన్నత విద్యావంతులను చేయడానికి తల్లిదండ్రులు ముందుకు వచ్చినపుడే లింగవివక్ష, లైంగిక దాడులు కనుమరుగవుతాయన్నారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ రిసోర్స్ గ్రూపులో సభ్యులుగా ఉన్న ఎంఎస్‌కేలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోర బాలికలకు 9 అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ఎంపీడీవో రవిబాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మున్నీ, వెలుగు ఏపీఎం తాళ్ల సురేష్, న్యాయవాది కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి పురుషులు, మహిళల పవర్ లిఫ్టింగ్ పోటీలలో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు సోమవారం తెలిపారు. మైలవరం ఫిట్‌జోన్‌లో ఎన్టీఆర్, కృష్ణా డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ది వెంకట్ ఫిట్‌జోన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో 53 కిలోలు కేటగిరీ సబ్ జూనియర్ పోటీలలో క్రాంతి కుమార్ 320 కిలోలు బరువునెత్తి గోల్డ్ అదే విధంగా పీవీ సాయిరామ్ 270 కిలోలు బరువునెత్తి సిల్వర్, డి. జీవన్‌రెడ్డి, 290 కిలోలు బరువునెత్తి సిల్వర్, 66కిలోలు కేటగిరీలో కేకే సిద్దార్థ 397 కిలోలు బరువునెత్తి గోల్డ్, ఏ. అవినాష్ 297 కిలోలు బరువునెత్తి బ్రాంజ్, 93కిలోలు కేటగిరీలో కె. తిరుపతిరెడ్డి 365కిలోలు బరువునెత్తి బ్రాంజ్, 105 కిలోలు కేటగిరిలో రేవంత్ నాగసాయి 370 కిలోలు బరువునెత్తి గోల్డ్, కె. నారాయణస్వామి 400కిలోలు ఎత్తి గోల్డ్, ఎ.సాయి నిఖిల్ 300 కిలోలు బరువు ఎత్తి సిల్వర్ పతకాలు సాధించారన్నారు. వీరిని కోచ్ డాక్టర్ ఎన్‌వీ రాజకుమార్, జిమ్ కోచ్ ఎస్. నటరాజన్‌లను కళాశాల అధ్యక్షుడు జి. శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి అభినందించారని ఆయన చెప్పారు.

పీహెచ్‌సీలో 24 గంటలూ కాన్పులు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైద్యాధికారి విజయలక్ష్మి



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శివశంకర్

చాట్రాయి: స్థానిక పీహెచ్‌సీలో 24 గంటలు కాన్పులు చేస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చనుబండ పీహెచ్‌సీ నిర్మాణానికి స్థలాన్వేషణ చేస్తున్నామని, చాట్రాయి పీహెచ్‌సీ శిథిలావస్థలో ఉన్నందున కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయలేకపోతున్నామని, వైద్య సేవల్లో జిల్లాలో రెండో స్థానంలో చాట్రాయి పీహెచ్‌సీ ఉందని ఆమె తెలిపారు. అదే విధంగా వ్యవసాయాధికారి బి.శివశంకర్ మాట్లాడుతూ రూ.30 కోట్లతో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. పండ్లు, కూరగాయల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని ఉద్యాన శాఖాధికారి హేమ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో బ్రహ్మాచారి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, తదితరులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు కబడ్డీ పోటీల్లో రీజనల్ చాంపియన్స్‌గా నిలిచారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 24, 25 తేదీల్లో జరిగిన డిప్లొమా రీజనల్ స్పోర్ట్స్ మీట్ ఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ శ్రీవాణి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ తిరువూరుపై గెలుపొందడంతో ఈ ఘనత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ సోమవారం వెల్లడించారు. గెలుపొందిన సభ్యులు జనవరి 28, 29, 30 తేదీల్లో వైజాగ్‌లో జరగనున్న స్టేట్ లెవెల్ మీట్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. మరో డిప్లొమా విద్యార్థి సీహెచ్ వెంకటగోపి షాట్ పుట్ ఈవెంట్‌లో ఫస్ట్ ప్లేస్ సాధించి స్టేట్ లెవెల్ షాట్ పుట్ కాంపిటీషన్స్‌కి క్వాలిఫై అయ్యాడు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణయ్య, పీడీలు మురళీనాథ్, శివశంకర్, మల్లికార్జున్ క్రీడాకారులను అభినందించారు.

3 నుంచి తిరువూరులో సీపీఎం జిల్లా మహాసభలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జనవరి 3, 4, 5 తేదీల్లో సీపీఎం ఎన్టీఆర్ జిల్లా 25వ మహాసభలు తిరువూరులో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ తెలిపారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దోనేపూడి కాశీనాథ్, కె శ్రీదేవి, కార్పొరేటర్ బోయి సత్యబాబులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్‌ను సోమవారం కృష్ణ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభలో తొలి రోజు జనవరి 3న జరిగే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

వేడుకల వేళ నిబంధనలు పాటించాలి

ఇబ్రహీంపట్నం: న్యూ ఇయర్ వేడుకల్లో పోలీస్ నిబంధనలు పాటించాలని సీఐ చంద్ర శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. ర్యాలీలకు ఎటువంటి అనుమతులు లేదని, డీజే సౌండ్ బాక్సులు, బాణాసంచా వంటివి నియంత్రించి పక్కవారికి అసౌకర్యం కలిగించకుండా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా



తిరువూరు బోస్‌సెంటర్లో వామపక్షాల నిరసన

తోటమూల(గంపలగూడెం): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఎం మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తోటమూలలో ధర్నా నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ధర్నాలో పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రి బాధ్యతలు చేపట్టిన అమిత్‌షా అలాంటి మాటలు మాట్లాడటాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సి ఉందన్నారు. అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు జి. సీతారామిరెడ్డి, ఎం. వెంకటరెడ్డి, ఎం. కుటుంబరావు, మీసాల గోపి పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

నూజివీడు: అంబేడ్కర్‌ను అవమానించడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని సీపీఐ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు అన్నారు. పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని కోరుతూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస సెంటర్‌లో నిరసన తెలిపారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయింకుల లక్ష్మణరావు, సీపీఐ టౌన్ సెక్రటరీ చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన

తిరువూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ తిరువూరులో వామపక్షాలు సోమవారం ఆందోళన నిర్వహించాయి. స్థానిక బోస్‌సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేసిన అనంతరం పట్టణంలో ప్రదర్శన జరిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

చాట్రాయి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను భర్తరఫ్ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. సోమవారం చాట్రాయి సెంటర్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

ముసునూరు: బడుగు బలహీన వర్గాల దేవుడు అంబేడ్కర్‌ను కించపరుస్తూ వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రం ముసునూరు సెంటర్‌లో అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు, నేతలు పిల్లి మురళి, కృష్ణ, గంగుల సత్యం, పంగిడయ్య, పోతురాజు, శ్రీను, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనకు సలాం



ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్న హెచ్ఎం హేమలత

మైలవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి భారత విద్యావైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. మండల స్థాయిలో విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్‌ను డాక్టర్ లకి రెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ద్రావిడ్ ఎకో ఫ్రెండ్లీ నర్సరీ గురించి ప్రదర్శించగా.. ఇది జిల్లా స్థాయికి ఎంపిక అయింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఎల్. బాలు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె. కనకదుర్గ, సైన్స్ ఉపాధ్యాయులు కె. సుజాత కె. కృష్ణ భాస్కర్‌ను అభినందించారు.

ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. దీనిలో భాగంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్‌ల నుంచి విద్యార్థులు సైన్స్ నమూనాలను తీసుకొచ్చి ప్రదర్శించారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్ఎం బి. హేమలత సైన్స్ నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఘాట్ రోడ్లలో యాక్సిడెంట్లు జరగకుండా ముందుగానే సైరన్‌తో హెచ్చరించే నమూనా, వంటగదిలో వంట గ్యాస్ లీక్ అయితే దానిని ఆటోమేటిక్‌గా బయటకు పంపే నమూనా, వర్షాలకు వ్యవసాయ ఉత్పత్తులు తడవకుండా ఆటోమేటిక్‌గా పట్టాను కప్పే నమూనా, అపార్ట్‌మెంట్లు, పెద్ద పెద్ద బిల్డింగుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆటోమేటిక్‌గా ఎమర్జెన్సీ డోర్ తెరుచుకునే నమూనా వంటివి ఆకట్టుకున్నాయి. ఈ సైన్స్ ఫెయిర్‌లో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండల విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు బీవీఎస్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ముసునూరు: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో సృజన శీలత మెరుగుపడుతుందని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. సోమవారం ముసునూరు హైస్కూల్‌లో మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు కేటగిరీల్లో ప్రథమ స్థాయి విజేతలను ఆయన ప్రకటించారు. వ్యక్తిగత విభాగంలో ముసునూరు హైస్కూల్ నుంచి ప్రదర్శించిన భూకంప హెచ్చరికలు, గ్రూపు విభాగంలో గురుకుల బాలికల విద్యాలయం ప్రదర్శించిన సూక్ష్మదర్శిని పని చేసే విధానం, ఉపాధ్యాయుల విభాగంలో చెక్కపల్లి హైస్కూల్ ప్రదర్శించిన సౌర శక్తి ప్యానెల్స్ అధిక వినియోగం అంశాలు ప్రథమ స్థాయిలో నిలిచినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో హెచ్ఎం సునీల, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నూజివీడు: మండలంలో ఈ నెల 31న సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు. మండలంలో 10,413 మందికి పింఛన్ల నగదును పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి రూ.4.43 కోట్లను సచివాలయ సిబ్బందికి అందజేసినట్లు చెప్పారు. వీరందరూ ఈ నెల 31న ఉదయం ఆరు గంటల నుంచి లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తారన్నారు. పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

గ్రీన్ హైడ్రోజన్ వాడకంపై పరిశోధనలు జరగాలి

మైలవరం: గ్రీన్ హైడ్రోజన్ వాడుక, ట్రాన్స్‌పోర్టేషన్, ఇండస్ట్రీస్, డొమెస్టిక్ రంగాల్లో ఊపందుకునే దిశగా ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరగాలని కెనడా ఒంటారియోటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బాలే ఏ రెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఏఐసీటీఈ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఎమర్జింగ్ గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ టెక్నాలజీస్ ఫర్ సొసైటల్ సస్టెయినబిలిటీ అండ్ క్లైమేట్ చేంజ్ మిటిగేషన్ ఏఐ అంశంపై కార్యక్రమం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ బాలే వి. రెడ్డి మాట్లాడుతూ సమీప భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ వాడుక ట్రాన్స్‌పోర్టేషన్, ఇండస్ట్రీస్ తదితర రంగాలలో ఎంతో ఆవశ్యకత ఉందని, వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఐఐఎస్‌సీ బెంగళూరుకి చెందిన డాక్టర్ ఎం. శివ పూజి, మద్రాస్ ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఏ. రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు ప్రసంగించారు.

ఇబ్రహీంపట్నం చేరిన యూటీఎఫ్ ప్రచార జాత

ఇబ్రహీంపట్నం: కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు పురస్కరించుకుని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లా శాఖ విజయవాడలో ప్రారంభించిన ప్రచార జాత సోమవారం ఇబ్రహీంపట్నం చేరింది. ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్ కుమార్, మాజీ కోశాధికారి సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రచార జాత సభ్యులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు రెడ్‌స్టార్, అమర్‌నాయక్ తదితరులు స్వాగతం పలికారు.

జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నూజివీడు: ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లేందుకు ఆసక్తి ఉండి తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న పేదలు జాబ్‌కార్డులకు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ సోమవారం తెలిపారు. జాబ్‌కార్డు తీసుకున్న వారు ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన పని లేదని, ఇది ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్నారు.

15 మందిపై బైండోవర్ కేసులు

ఆగిరిపల్లి: మండలంలో పలు గ్రామాలకు చెందిన సారా విక్రయదారులు, బెల్ట్ షాపు నిర్వాహకులు, సారా బెల్లం అమ్మే వ్యాపారస్తులపై తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. మొత్తం 15 మందిని సోమవారం తహసీల్దార్ ప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. మళ్లీ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయలు జరిమానా విధించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని తహసీల్దార్ ప్రసాద్ హెచ్చరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com